మహిళల సాధికారతే అభివృద్ధికి పునాది

మహిళల ఆర్థిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: మహిళల సాధికారతే సమాజఅభివృద్ధికి పునాది అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.నాబార్డ్ ఆర్థిక సహకారంతో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహబూబ్ నగర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి గ్రామ దుకాణం" ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు స్వయంగా తయారుచేసిన పల్లె ఉత్పత్తులు,ఆహారపదార్థాలు,హస్తకళా వస్తువులకు మార్కెట్ వేదిక కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితి మరింత బలోపేతం అవుతుందని అన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే కాకుండా, సమాజంలో గౌరవ స్థానాన్ని సంపాదించుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మహిళా శక్తి – రాష్ట్ర శక్తి" అనే నినాదంతో ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైత్రి యాదయ్య , మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి గ్రామ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

జిల్లా సమగ్ర అభివృద్ధికి సమర్ధవంతంగా పని చేయాలి

గద్వాల ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: జోగులాంబ గద్వాల జిల్లా అన్ని రంగాల్లో ముందుండేలా జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికార యంత్రాంగం సమర్ధవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.జోగులాంబ గద్వాల జిల్లా నూతనకలెక్టర్‌గా శుక్రవారం ఐడిఓసి లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందేలా ఆయా శాఖల అధికారులు నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి పౌరులకు నిష్పక్షపాతంగా, పారదర్శకమైన సేవలందించాలన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగుపడాలంటే అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తమ పరిధిలోని పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో అన్ని శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేయబోయే పనుల సమగ్ర వివరాల నివేదికను తయారు చేసి అందజేయాలన్నారు. జిల్లాలోని ఆయాశాఖల ఆర్థిక పరిస్థితులవివరాలను కూడా అందజేయాలన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి ఆయా శాఖల ఉన్నతాధికారులు అడిగే ప్రతి సమాచారాన్ని నిరక్ష్యంగా వహించకుండా సకాలంలో పంపించేందుకు సంబంధిత అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిరక్ష్యంగా వ్యవహరించే అధికారులతో కఠినంగా వ్యవహరిస్తానన్నారు.పీఎండికేవై (ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన)కు మన జిల్లా కూడా ఎంపిక కావడంతో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఇందిరమ్మ గృహాలు, తదితర శాఖల పనితీరు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండేలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కు పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలుకుతూ పుష్పగుచ్చాలు, మొక్కలు అందజేశారు. పలువురు అధికారులు శాలువాతో సన్మానించారు. అనంతరం పలువురు మత పెద్దలు కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వచనం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ (రెవిన్యూ), నర్సింగరావు (స్థానిక సంస్థలు), ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే నన్ను

ఈ స్థాయికి తెచ్చింది

వార్డు మెంబర్ నుంచి మంత్రిని అయ్యాను భయంతో సేవ చేయడం నేర్చుకున్నా యెన్నం దూరదృష్టి గల నాయకుడు మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ప్రమాణ స్వీకారోత్సవంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి, మేయర్,డిప్యూటీ మేయర్

మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వారికి భయంతో సేవ చేయడం నేర్చుకున్నా. అందుకే నేడు ప్రజల ఆశీర్వాదంతో మంత్రి స్థాయికి ఎదగగలిగాను" అని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థలో మేయర్, డిప్యూటీ మేయర్‌ల పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర యువజన క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వార్డు మెంబర్ స్థాయి నుంచి రాష్ట్ర మంత్రిగా ఎదగడం ప్రజలకు నమ్మకంగా చేసిన సేవల ఫలితమేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మేయర్ గుమాల మమత శ్రీనివాస్ ని , డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహబూబ్‌నగర్‌తో తనకు విడదీయరాని బంధం ఉందన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి రూపంలో మహబూబ్‌నగర్‌కు దూరదృష్టి గల నాయకత్వం లభించిందని మంత్రి ప్రశంసించారు. వారి నాయకత్వంలో మహబూబ్‌నగర్ అన్ని రంగాల్లో వేగంగా సమగ్రమైన అభివృద్ధి జరుగుతుందని కితాబిచ్చారు.

రేవంత్ రెడ్డి తోనే సామాజిక న్యాయం సాధ్యం: యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ సూచనలతో, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా మాత్రమే సామాజిక న్యాయం అమలవుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగినప్పటికీ, ఎక్కడా జరగని విధంగా మహబూబ్‌నగర్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు ఏకగ్రీవంగా కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇది మహబూబ్‌నగర్ ప్రజల ఔన్నత్యానికి నిదర్శనమని అన్నారు. అన్ని కులాలు, మతాలు, వర్గాలు, రాజకీయ పక్షాలు ఒకే వేదికపై చేరి నగరాభివృద్ధి కోసం ఏకాభిప్రాయంతో ముందుకు రావడం మహత్తర ఘట్టమని చెప్పారు. మహబూబ్‌నగర్ అభివృద్ధే మన లక్ష్యం, మన ధ్యేయంగా, వేల కోట్ల రూపాయల నిధులు నగరానికి తీసుకువచ్చామని, వందల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరిగాయని వివరించారు. ముఖ్యమంత్రి స్వహస్తాలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం, తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం శంకుస్థాపన జరిగినట్లు చెప్పారు. ప్రతి డివిజన్, ప్రతి కాలనీ, ప్రతి బస్తీలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల పెంపు, పారదర్శక పాలన, నిధుల సక్రమ వినియోగం – ఇవే రాబోయే ఐదేళ్ల లక్ష్యాలుగా కార్పొరేటర్లకు సూచించారు.రాజకీయ భేదాలు పక్కన పెట్టి, విమర్శలకు తావు ఇవ్వకుండా, నిర్విరామంగా కృషి చేస్తే మహబూబ్‌నగర్ తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శ కార్పొరేషన్‌గా నిలుస్తుందని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్‌పి వెంకటేష్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు ఐఎన్టీయుసి రాములు యాదవ్, అజ్మత్ అలి, సాయిబాబా, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కార్పొరేటర్లు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం

పదవి బాధ్యతలు చేపట్టిన మేయర్ గుమాల్ మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్ కార్పొరేటర్ల పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మేయర్ గుమాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డిని, కార్పొరేటర్లను ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా పారదర్శకంగా, అభివృద్ధి దిశగా, ప్రజాసేవలో నిబద్ధతతో పని చేయాలని సూచించారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్‌పి వెంకటేష్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మత్ అలి, ఐఎన్టీయుసి రాములు యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కార్పొరేటర్లు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మేయర్ గుమాల్ మమత

డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

అవగాహన కల్పిస్తున్న ఎస్పీ జానకి

ఒక్కరి నిర్లక్ష్యం రెండు కుటుంబాలకు ప్రాణాంతకం

రోడ్డు ప్రమాదాలపై యువత జాగ్రత్తలు తీసుకోవాలి

ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే భద్రత

అరైవ్ అలైవ్" కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :ఒకరి అజాగ్రత్త వల్ల రెండు కుటుంబాలకు ప్రమాదం జరగవచ్చని కావున ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ సూచించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎంవిఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రోడ్డుభద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి.జానకి జిల్లా ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ వంటి ప్రమాదకర అలవాట్ల వల్ల జరిగే ప్రమాదాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల చిత్రాలను ప్రదర్శించి, వాటిలో జరిగిన తప్పిదాలు నిరక్ష్యాల్లను విశ్లేషిస్తూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని ఎస్పీ స్పష్టం చేశారు.ఒక రోడ్డుప్రమాదం జరిగితే కేవలం ప్రమాదానికి కారణమైన వ్యక్తిమాత్రమే కాదు,బాధితుడి కుటుంబసభ్యులు కూడా తీవ్రఇబ్బందులకు గురవుతారని తెలిపారు.యువతలో ఈ వయసులో బైక్‌లు,కార్లు నడపడం థ్రిల్‌గా అనిపించిన ప్పటికీ సరైన అవగాహన లేకుండా,భద్రతా చర్యలు తీసుకోకుండా వాహనాలు నడపడంవల్ల ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. మన ప్రాణాలే కాకుండా ఎదుటివారి ప్రాణాలు కూడా విలువైనవని, ఒక చిన్న నిరక్ష్యం రెండు కుటుంబాలను శాశ్వత దుఃఖంలో ముంచవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మావతి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మహబూబ్‌నగర్ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, కళాశాల అధ్యాపకులు, ఇతర పోలీసు సిబ్బంది విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఖిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పేరుతో

అక్రమంగా ఇసుక రవాణా

పర్మిషన్ 2 రెండు ట్రిప్పులు.. తరలించేది రోజుకు 100 ట్రిప్పులు పట్టించుకోని రెవెన్యూ పోలీస్ అధికారులు

ఖిల్లా గణపురం ఫిబ్రవరి 27. ప్రభాతవార్త: మండల పరిధిలోని మల్కి మీయాన్ పల్లి శివారులో గల పిల్లి వాగు నుండి గత రెండు సంవత్సరాలుగా ఇసుకను ప్రభుత్వ పనుల పేరుతో అక్రమంగా తరలిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఒక్కో టాక్టర్‌కు రెండు ట్రిప్పులకు పర్మిషన్లు తీసుకుని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒక ట్రాక్టర్ 10 ట్రిప్పులకు పైగా అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతిరోజు అక్రమ ఇసుక రవాణా పోలీస్ స్టేషన్ తో పాటు రెవెన్యూ కార్యాలయం ముందు నుంచి వెళుతున్న కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై గతంలో ఆ గ్రామ రైతులు తహసిల్దార్ తో పాటు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో నెల రోజులపాటు ఇసుక రవాణాను నిలిపివేశారు. మళ్లీ గత పది రోజులుగా అక్రమ ఇసుక రవాణాకు తహసిల్దార్ కార్యాలయం అధికారులే తెర లేపారని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. పిల్లి వాగులో నాలుగు ఐదు హిటాచీలతో ప్రతిరోజు వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. స్థానిక తహసిల్దార్ ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అనుమతులు ఇస్తుండడంతో ఎవరు ఏమీ చేయలేకపోతున్నారని దీంతో అక్రమ ఇసుక రవాణా దారులకు మూడు పువ్వులు ఆరుకాయలుగా తమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. గత ఐదేళ్ల క్రితం మండలంలోని కమాలుద్దీన్ పూర్ గ్రామశివారులో ప్రభుత్వం ఇసుక క్వారీని గుర్తించి అక్కడి నుండి ఇసుక తరలింపు కోసం ఆన్లైన్ లో పలు ట్రాక్టర్లను నమోదు చేయించుకున్నారు. అప్పటినుండి అక్కడి నుండే ఆన్లైన్లో నమోదు చేసుకున్న వారికి ఇసుక తరలింపును రెవెన్యూ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. వర్షాకాలంలో అక్కడినుండి ఇసుక తరలింపుకు ఇబ్బంది కావడంతో మలికిమీయాన్ పల్లి పరిధిలోని పిల్లి వాగు నుండి అనుమతులు ఇవ్వడం ప్రారంభించారు. ఇదే అదనుగా భావించిన ఇసుక అక్రమ రవాణా దారులతో పాటు రెవెన్యూ అధికారులు – మిగతా3లో..

పిల్లి వాగు నుండి ఇసుకను తరలిస్తుండడంతో భూములు కోతకు గురైన దృశ్యం

పిల్లి వాగు నుండి ఇసుకను తరలించడానికి ఉపయోగిస్తున్న యంత్రాలు

నూతన హాలుకు ప్రారంభోత్సవం చేస్తున్న డీజీపీ సంజయ్ కుమార్ జైన్

ఆధునిక సౌకర్యాలతో

సాయిధ కన్వెన్షన్ హాల్

ఘనంగా 10వ బెటాలియన్‌లో ప్రారంభోత్సవాలు

ముఖ్య అతిథిగా అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్ హాజరు

ఎర్రవల్లి ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: జోగుళాంబ గద్వాల్ జిల్లాలోని 10వ బెటాలియన్‌లో నిర్వహించిన పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు సంజయ్ కుమార్ జైన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, బెటాలియన్స్,హైదరాబాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.కార్యక్రమానికి ముందుగా 10వ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్ ఎం.జయరాజు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం – మిగతా3లో..

విద్యాసంస్థలను నిర్వీర్యం చేయడమే ప్రభుత్వ లక్ష్యమా?

- మెడికల్ కళాశాలను సందర్శించిన మాజీ మంత్రి
- విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న నిరంజన్ రెడ్డి
- మెడికల్ కళాశాల ఆవరణలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మించడం అవివేకం
- విద్యా ఆరోగ్య శాఖ మంత్రికి లేఖతో పాటు సమస్యను ఫోన్ ద్వారా వివరించిన మాజీ మంత్రి
- సానుకూలంగా స్పందించిన దామోదర రాజనర్సింహ

వనపర్తి,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం స్థానిక మెడికల్ కళాశాలను సందర్శించి విద్యార్థులను కలసి కళాశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని మెడికల్‌కళాశాల ఆవరణలో యంగ్‌ఇండియా స్కూల్ కోసం 8ఎకరాలస్థలం కేటాయించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈసందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రములో అత్యంత ఉన్నత ప్రమాణాలతో మెడికల్ కళాశాల ఉండాలని భావి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఉండాలని మెడికల్, ప్యారా మెడికల్,హాస్టల్, రీసర్చ్ సెంటర్, వసతిని దృష్టిలో ఉంచుకొని 50 ఎకరాలతో సువిశాలమైన మెడికల్ కళాశాల ఆవరణ ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో నర్సింగ్ కాలేజ్ పూర్తి అయి అందులో ప్రస్తుతం మెడికల్ కళాశాల కొనసాగిస్తున్నారని అదేవిధంగా మెడికల్ కళాశాల అన్ని హంగులతో రూపుదిద్దుకుంటుంది అని అన్నారు. ప్రభుత్వం అనాలోచిత చర్యలతో మెడికల్ కళాశాల ఆవరణలో యంగ్ ఇండియా స్కూల్ కోసం 8ఎకరాలు కేటాయించడం అనైతిక చర్య అని దుయ్యబట్టారు.రాబోవు రోజుల్లో మెడికల్ కళాశాలకు అనేక మౌలిక వసతుల కోసం స్థలం అవసరమని ప్రభుత్వం పునః పరిశీలించి యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలమును ఉపసంహరించుకోవాలని అన్నారు. ప్రభుత్వ స్థలాలు అనేకం ఉన్నాయని వాటిలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మించాలని మాకు ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు.సంప్రదింపులు,చర్చలు లేకుండా ఏకపక్షంగా కేటాయించడం పద్ధతి కాదని అన్నారు. మెడికల్ కాలేజీలు వెలువడే వ్యర్థాలు డిస్పోజల్ మేనేజ్మెంట్ ద్వారా దూరం చేయడం జరుగుతుందని అటువంటి ఆవరణలో స్కూల్ ఏర్పాటు చేయడం విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం అడట మేనన్నని అన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి నిరంజన్ రెడ్డి లేఖ....

దామోదర రాజనర్సింహ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కి మెడికల్ కళాశాల ఆవరణలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ ఇక్కడి పరిస్థితులను వివరిస్తూ లేఖా వ్రాసి స్వయంగా ఫోన్ చేసి పునఃపరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకుంటే నా సొంత స్థలం ఇవ్వడానికి సిద్ధమని,మెడికల్ కళాశాల ఆవరణలో ఎటువంటి ఇతర నిర్మాణాలకు పూనుకోవద్దని ఇది భవిష్యత్ తరాలకు,ప్రజాహితానికి ముప్పు వాటిల్లుతుందని నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, గంధం బాలపీర్,గంధం పరంజ్యోతి, ధర్మా నాయక్, కౌన్సిలర్స్ మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్, ప్రేమ్ నాథ్ రెడ్డి,హరిబాబు, బండారు కృష్ణ, దేవర్ల నరసింహ, రవి ప్రకాష్ రెడ్డి, బాబు నాయక్, డా.డ్యానియల్, హేమంత్ ముదిరాజ్, వెంకట్ సాగర్,జోహెబ్ హుస్సేన్,చిట్యాల రాము, మంద రాము, బొబ్బిలి ప్రేమ్ కుమార్,పెద్ద ముక్కల రవి,ముద్దు సార్, తేజా రెడ్డి, మర్రికుంట శ్రీను, కురుమూర్తి తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి

మెడికల్ విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ మంజూరు పత్రాలు పంపిణీ

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోయిలకొండ ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేయడం జరుగుతుందని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జి రవీందర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై విద్యాసాగర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్యపాల్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం వారు మండల కేంద్రమైన కోయిలకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని పెరికివీడు గ్రామ ఇందిరమ్మ జాబితా అర్హులకు ఇందిరమ్మ ఇంటినిర్మాణ మంజూరు పత్రాలను వారు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వడానికి నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇండ్లు రాలేదని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ డి తిరుపతయ్యగౌడ్, గ్రామ పెద్దలు జి ఆనంద్, వార్డు సభ్యుడు ఎం రామస్వామి, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సూరారం వెంకటయ్య,, సూరారం ఉపసర్పంచ్ అఖిల్, పెరికివీడు గ్రామ ఉపసర్పంచ్ ఏడుకొండలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరులో పీహెచ్‌సీకి సేఫ్టీ బారికేడ్లు అందజేత

సేఫ్టీ బారికేడ్లు అందజేస్తున్న దృశ్యం

మద్దూరు, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఓపీ రిజిస్ట్రేషన్ విభాగంలో రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సేఫ్టీ బ్యారికేడ్స్, ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ఈ సదుపాయాలను మున్సిపల్ చైర్మన్ సరస్వతి జనార్ధన్ ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు సౌకర్యవంతమైన సేవలతో పాటు భద్రత కూడా ముఖ్యమని పేర్కొన్నారు. రద్దీ సమయంలో ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగా సాగేందుకు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. డా. భవాని మున్సిపాలిటీ అందించిన సౌకర్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జీడి మోనిక ప్రకాష్, సంజీవ్, రాజు సలాం, అన్వర్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విరమణ కాదు ప్రజాసేవకు అంకితం కావాలి

టిపిసిసి ఉపాధ్యక్షులు డా.చిక్కుడు వంశీకృష్ణ

ఉప్పునుంతల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : పదవీ విరమణ కాదు ప్రజాసేవకు అంకితం కావాలని టి పిసిసి ఉపాధ్యక్షులు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ హితవు పలికారు. శుక్రవారం అచ్చంపేట పట్టణంలోని బికే శ్యామ్స్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సబావత్ బిచ్చ నాయక్ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధి లో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఎంతో ముఖ్యమని, ఉద్యోగ విరమణ అనేది విశ్రాంతి దశ మాత్రమే కానీ అనుభవాలకు, సమాజానికి పంచే కొత్త అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన సేవా సంఘం నాయకులు, మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు, అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, బంధుమిత్రులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థినీ, విద్యార్థులు

దామరగిద్ద, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : దామరగిద్ద మండల పరిధిలోని మొగల్మడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు.విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తమ తమ పాత్రల్లో లీనమై బోధన చేపట్టారు. ఈ అనుభవం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని,భవిష్యత్తులో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాలనే ఆకాంక్ష ఉందని విద్యార్థులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.ఈ కార్యక్ర మంలో జిహెచ్ఎంగా మేఘనాథ్, కలెక్టర్‌గా నర్సింహులు,డిప్యూటీ కలెక్టర్‌గా నందిని, డీఈవోగా నరేష్, డిప్యూటీ డీఈవోగా మనూష, ఎంఈఓగా పూజ విద్యార్థులు బాధ్యతలు నిర్వహించారు. అలాగే భవానీ,వైశాలీ, అర్చన,స్రవంతి,శ్రావణి,నందిని,శిరీష, హర్షవర్ధన్,శివ,సాయికుమార్, వేణు గోపాల్, శ్రీనివాసు తదితరులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. మంచిగా పాఠ్యాంశ బోధన చేసిన విద్యార్థి ఉపాధ్యాయులకు ఎంఈఓ కృష్ణా రెడ్డి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం నవశ్రీ, బనదయ్య, శశిధర్, ప్రకాష్, వెంకట్ నాయక్, అం జిలయ్య, భాగ్యమ్మ,మల్లికార్జున్, అంజిలప, భీరప్ప, వేణుగోపాల్‌లతో పాటు సర్పంచ్ రాములు, ఉపసర్పంచ్ లక్ష్మీ అంజిలప, అనురాధ, గ్రామస్తులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ధన్వాడలో బాల్య వివాహాల

నిర్మూలనపై అవగాహన కార్యక్రమం

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ధన్వాడ, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : మండల కేంద్రమైన ధన్వాడలో బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్యారడీగల్ వాలంటీర్ రజిని ప్రజలకు చట్టపరమైన వివరాలు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21సంవత్సరాలలోపు బాలురకు వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు జరిపించిన తల్లిదండ్రులు, పెద్దలు, మధ్యవర్తులు, బ్యాండ్ మేళం సభ్యులు సహా సంబంధిత వారందరికీ చట్టరీత్యా శిక్షలు విధించబడతాయని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 100 లేదా 1098 హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని ప్రజలను కోరారు. బాల్య వివాహాల వల్ల పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ఉప్పునుంతల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తా నుంచి కంసాని పల్లి మార్గంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఆర్‌అండ్‌బి శాఖ నిధులచే చేపడుతున్న విస్తరణ పనులు మట్టి తొలగింపు పనులు ప్రారంభించారు. వేగవంతంగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కావడంతో మండల కేంద్రమైన ఉప్పునుంతల నుంచి కల్వకుర్తి మార్గం వెళ్లే ప్రజలు ప్రత్యేకంగా గుత్తేదారుకు, ఆర్‌అండ్‌బి శాఖ అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ముగిసిన వార్డు మెంబర్ల శిక్షణ తరగతులు

సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు

నవాబుపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : గత ఐదు రోజులుగా మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల మొదటి విడత శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయరాం నాయక్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, పారదర్శక పరిపాలన, పంచాయతీ రాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్రపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించడం, నిధుల వినియోగం,ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య చర్యలు సంక్షేమ పథకాల అమలు అంశాలపై సభ్యులకు వివరించినట్లు పేర్కొన్నారు. ప్రజలతో సమన్వయం పెంపొందించుకుని పారదర్శకంగా పని చేయాలని సభ్యులకు సూచించారు. అనంతరం వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ అధికారులు మండల అధికారులు, గ్రామాల వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌యు వీసీ రాజీనామా చేయాలి

ఎస్ఎఫ్ఐ పియూ అధ్యక్షుడు రాము

యూనివర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాత వార్త : జెఎన్‌యు యూనివర్సిటీ లో కులం పేరుతో మతం పేరుతో దూషించి విద్యార్థులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఢిల్లీ జెఎన్‌యూ యూనివర్సిటీ వీసీ శాంతి దూలపూడి పండిత్ లను వెంటనే తొలగించాలని పియూ అధ్యక్షుడు రాము, ఎస్ఎఫ్ఐ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి భరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ పాలమూరు యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం ఢిల్లీలోని జెఎన్‌యూ యూనివర్సిటీలో కొంత మంది మతోన్మాద సంఘాల నాయకులు సమస్యలపై ప్రశ్నించిన విద్యార్థులపై అలాగే అధ్యాపకులపై కులం పేరుతో మతం పేరుతో దూషించి వారిని విపరీతంగా కొట్టారన్నారని,వారిపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమస్యలపై విద్యార్థులు అధ్యాపకులు వెళ్లి విసికి చెబితే వారు కూడా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించి మళ్లీ విసి కూడా వారిని కులం పేరుతో మతం పేరుతో దూషించి మిమ్మల్ని రెస్ట్ గెట్ చేస్తానని బెదిరించారన్నారు. ఇంత నిరక్ష్యంగా ఉన్నటువంటి యూనివర్సిటీ వీసీని వెంటనే తొలగించాలన్నారు. అలాగే ఈ దాడికి నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ వీసీ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. లేదంటే దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అన్నియూనివర్సిటీలలో పెద్దఎత్తున విద్యార్థిఉద్యమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పాలమూరు యూనివర్సిటీనాయకులు సాయి,శేఖర్,సుధాకర్, ఆదిత్య,జస్వంత్ రెడ్డి,మాణిక్,కీర్తి, సృజన, విద్యులత, రేణుక, ప్రణిత పాల్గొన్నారు.

గలీజ్ దందాగా ప్రైవేట్ పాఠశాలల ఫీజుల మోత

వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్

నారాయణపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రైవేట్ పాఠశాలల ఫీజులు తెలంగాణలోనే అత్యధికంగా ఉన్నాయని తెలంగాణ విద్యా కమిషన్ వెల్లడించడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లలో గల్లీ బడుల ఫీజుల మోత గలీజ్ దందాగా మారిపోయిందని ఆయన విమర్శించారు. పదేళ్ల క్రితం రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల సరాసరి వార్షిక ఫీజు రూ.50,000 ఉండగా, ప్రస్తుతం అది రూ.1,90,000కు చేరిందన్నారు. ప్రతి ఏడాది 10 నుండి 30 శాతం వరకు ఫీజులు పెంచుకుంటూ పోతుండగా, ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించాయని ఆరోపించారు 2015,16లో తెలంగాణలో సరాసరి ఫీజు రూ.50,000 ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో రూ.35,000, తమిళనాడులో రూ.40,000, ఆంధ్రప్రదేశ్‌లో రూ.38,000, ఢిల్లీలో అత్యధికంగా రూ.60,000 ఉండేదని తెలిపారు. అప్పట్లో ఢిల్లీ ప్రథమ స్థానంలో ఉండగా, ఇప్పుడు తెలంగాణ ముందంజలో ఉందని విద్యా కమిషన్ గణాంకాలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. 2025,26 విద్యాసంవత్సరంలో ఉత్తరప్రదేశ్‌లో రూ.95,000, తమిళనాడులో రూ.1,00,000, ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,50,000, ఢిల్లీలో రూ.1,60,000 ఉండగా, తెలంగాణలో మాత్రం రూ.1,90,000 ఫీజు ఉందని కమిషన్ గుర్తించిందన్నారు. గత ప్రభుత్వాలు నియంత్రణ లేకుండా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు స్వేచ్ఛనిచ్చి, పార్టీ ఫండ్ పేరుతో బాండ్ల రూపంలో వసూళ్లకు పాల్పడ్డాయని తీవ్ర ఆరోపణలు చేశారు. ఫీజుల భారం తట్టుకోలేక తల్లిదండ్రులు అప్పుల పాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు దోపిడీకి అడ్డుకట్ట వేయాలని చొరవ చూపడం అభినందనీయమన్నారు. ఇంజనీరింగ్ తరహాలో ప్రత్యేక ఫీజు నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసి, తల్లిదండ్రులపై భారం తగ్గించే చర్యలు తీసుకోవడం సరైన నిర్ణయమని పేర్కొన్నారు. ఫీజు నియంత్రణపై ముసాయిదాను ప్రజల అభిప్రాయాల కోసం అందుబాటులో ఉంచడం ప్రజాపాలనకు నిదర్శనమని, ప్రభుత్వం పారదర్శక విధానంతో ముందుకు సాగుతోందని బండి వేణుగోపాల్ అన్నారు.

పంటల సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన

రైతుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎడిఎ చంద్రశేఖర్

ఉప్పునుంతల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం ఆత్మ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఉప్పునుంతల క్లస్టర్ రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అచ్చంపేట వ్యవసాయ సంచాలకులు చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నూనె గింజల మిషన్‌పై నిర్వహిస్తున్న శిక్షణ పట్ల ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలని రైతులకు సూచించారు. జాతీయ చినదగు నూనె గింజల మిషన్ గురించి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంటలో చీడపీడల గురించి, ఎరువుల యజమాని పద్ధతులు, పంటల సస్యరక్షణ చర్యల పట్ల రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ సంచాలకులు ఎం.చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి రమేష్, స్థానిక పిఎసిఎస్ (సింగిల్ విండో) సీఈఓ కొత్త రవీందర్ రావు, ఉప్పునుంతల సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, నాయకులు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ మడ్డు నరేందర్ రెడ్డి, కట్ట షణ్ముఖరెడ్డి, కర్నాటి సత్యం, కదిరె కృష్ణయ్య, కొత్త అచ్చుతారెడ్డి, అంతటి వెంకటయ్య గౌడ్, సూరం ప్రశాంత్ రెడ్డి, మండల విస్తీర్ణాధికారులు మంజుల, చిన్యనాయక్, లక్ష్మీ రాగసంధ్య, సుమతి, సంతోష్, మహేష్, అధిక సంఖ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ రాజకీయ ప్రతీకారానికి చెంపదెబ్బ

తెలంగాణ జాగృతి నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్

దామరగిద్ద, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఉత్తమ పార్లమెంటేరియన్, తెలంగాణ ఉద్యమకారిణి అయిన కల్వకుంట్ల కవితపై కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతో మోపిన అక్రమ ఢిల్లీ లిక్కర్ కేసును ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేయడం సత్యం, న్యాయం గెలిచిన ఘట్టమని తెలంగాణ జాగృతి నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. తెలంగాణ స్వాభిమానాన్ని అణిచివేయాలనే దురుద్దేశంతో, ప్రజాస్వామ్య స్వరాలను భయపెట్టాలనే కుట్రలో భాగంగానే ఈ కేసు పెట్టారని కోర్టు తీర్పుతో మరోసారి రుజువైందన్నారు. మహిళా నాయకురాలిగా, పార్లమెంటులో తెలంగాణ గొంతుకగా నిరంతరం ప్రశ్నించినందుకే కవితను లక్ష్యంగా చేసుకొని కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. న్యాయస్థానం తీర్పుతో కేంద్ర ప్రభుత్వ రాజకీయ ప్రతీకార చర్యలకు చెంపదెబ్బ పడిందని, తప్పుడు కేసులతో నాయకులను భయపెట్టలేమని ఈ తీర్పు స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. ఇది కేవలం కవితకు మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజలందరికీ వచ్చిన నైతిక విజయం అని పేర్కొన్నారు. ఇకపై కూడా తెలంగాణ జాగృతి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, మహిళల హక్కుల కోసం, తెలంగాణ ఆత్మగౌరవం కోసం తన పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తుందని గవినోళ్ల శ్రీనివాస్ తెలిపారు.

సిఓ సరస్వతిబాయిని వెంటనే బదిలి చేయాలి

మున్సిపల్ కమిషనర్ ను కోరిన ఆర్పీలు

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

వనపర్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని అనేకమంది ఆర్పీలను మానసికంగా వేధిస్తున్న సిఓ సరస్వతి బాయిని వెంటనే బదిలీ చేయాలని ఆర్పీలు వనపర్తి మున్సిపల్ కమిషనర్ ను కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు కలిసిన ఆర్పీలు సిఓ సరస్వతి పై ఫిర్యాదు చేసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ గత కొంతకాలంగా సివో సరస్వతి 2,5,14,15,18,19,22వ వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్పీలను విధి నిర్వహణలో తీవ్రంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్య పరిస్థితుల్లో ఆర్పీలు ఆసుపత్రికి వెళ్లిన శుభ కార్యక్రమాలకు వెళ్లిన, చివరికి చావు బతుకులకు వెళ్లిన కూడా తన అనుమతి తీసుకోవాలని శ్రీ ముఖం జారీ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. చావు దగ్గర ఉంటే సెల్ఫీ దిగి ఫోటో పంపించాలని, ఆసుపత్రులకు వెళితే ఆసుపత్రి బిల్లులు చూపించాలని తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందని వివరించారు. తోటి అధికారులతో మాట్లాడితే కూడా అక్రమ సంబంధాలు అంటగడుతుందని సీఓ వేధింపులు తాళలేక కొందరు ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధమయ్యారని బోరున విలపించారు. సీఓ సరస్వతి వేధింపులు తట్టుకోలేక చాలామందికి బీపీ షుగర్ వంటి అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని తెలిపారు. ఆర్పీల ఆత్మగౌరవాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న సిఓ సర్వస్థితి బాయిని తక్షణమే ఇతర ప్రాంతానికి బదిలీ చేయాలని కమిషనర్ వెంకటేశ్వర్లును కోరారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ గంధం మదన్, మెకానిక్ శీను ఆర్‌పిలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆర్పిల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంధం సరస్వతి, శ్రీలక్షి మ్మ, బషీరాబేగం, ఖాతూన్, ముంత జయమ్మ, సువర్ణ, శిరీష, వాణి, కమలమ్మ, సాజిదా బేగం, రసీదా బేగం తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ డ్రైవింగ్ ప్రతి ఒక్కరి బాధ్యత : జిల్లా ఎస్పీ డా.వినీత్

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డా.వినీత్

నారాయణపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : నారాయణ పేట జిల్లా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన సురక్షితంగా గమ్యానికి చేరండి" 2వ విడత కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లా పరిధిలోని మెడికల్ కళాశాలలో విద్యార్థులకు డిఫెన్స్ డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డా.వినీత్ మాట్లాడుతూ డిఫెన్స్ డ్రైవింగ్ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని చెప్పారు. మైనర్లు వాహనం నడపరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని తెలిపారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి పత్రాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు. చిన్న నిరక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. మెడికల్ విద్యార్థులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. చివరగా విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని హామీ ఇచ్చారు.

తాటికుంట మాజీ సర్పంచ్‌కు నివాళ్లు

మల్దకల్ ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: మల్దకల్ మండల పరిధిలోని తాటికుంట గ్రామ మాజీ సర్పంచ్ మోలాసాబ్(80) శుక్రవారం ఉదయము అనారోగ్యంతో మృతి చెందాడు.ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి కుటుంబానికి తెలియజేశారు. వీరి వెంట మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సింగల్ విండో డైరెక్టర్,భానుప్రకాష్ రెడ్డి, సర్పంచ్ బోయ సరోజ, నరసింహులుతో పాటు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

వార్డు సమస్యలను పరిష్కరిస్తా..

పైప్‌లైన్ లీకేజీని పరిశీలిస్తున్న ఉపసర్పంచ్ కళ్యాణి కారి ఖాజ

శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : శ్రీరంగాపూర్ మండల కేంద్రం లో శుక్రవారం గ్రామ ఉపసర్పంచ్ కళ్యాణ్ కారి ఖాజ 13, 14 వ వార్డులలో ఉదయం పర్యటించారు. ఆ వార్డులో ఉన్న పైప్‌లైన్ లీకేజీ సమస్య, కొత్తగా నిర్మించాల్సిన డ్రైనేజీలను ఇంకా అవార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చేయవలసినటువంటి కార్యక్రమాలను గురించి వార్డ్ ప్రజలతో చర్చించడం జరిగింది. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇస్తూ అందరి సహాయ సహకారాలు తనకు అందించాలని తెలియజేయడం జరిగింది.

ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డు ప్రారంభం

పెద్దపల్లి సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి

కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్

మల్దకల్ ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: మల్దకల్ మండలం పరిధిలోని శుక్రవారం పెద్దపల్లి గ్రామంలో ఈరోజు హెల్త్‌కార్డులు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ప్రతి పేదవారికి ఈ కార్డు ఎంతో మేలుకలిగిస్తుందని గ్రామసర్పంచ్ చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్,వార్డ్‌మెంబెర్స్,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

ముస్తాపేట్ సర్పంచ్ సరస్వతి

డ్రైడే ఫ్రైడ్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది

దామరగిద్ద, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : దామరగిద్ద మండల పరిధిలోని ముస్తాపేట్ గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ సరస్వతి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వార్డు మెంబర్లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మురుగు నీరు నిలవకుండా ఇంకుడు గుంతలు వినియోగించాలని

సమన్వయంతో పని చేస్తే జిల్లా అన్ని రంగాల్లో ముందుంటుంది

◆ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

గద్వాల ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఫార్మర్ రిజిస్ట్రేషన్, గట్టు ఆస్పిరేషనల్‌బ్లాక్ ప్రోగ్రామ్ తో పాటు మన జోగులాంబ గద్వాల జిల్లా అన్ని రంగాల్లో ముందుండాలంటే సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ఐడిఓసి సమావేశపు మందిరంలో శుక్రవారం పలువురు జిల్లా అధికారులతో పాటు తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులతో ఆయా శాఖల పనితీరుపై కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ జిల్లాలో చాలా వెనుకబడిందని, మ్యాపింగ్ వేగవంతం చేసేలా సంబంధిత బిఎల్వోలకు లక్ష్యాలను నిర్దేశించి ముందుకెళ్లాలన్నారు. తహసిల్దార్‌లు మండల స్థాయిలో సంబంధిత అధికారులతో తరచూ సమన్వయ సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం కావడానికి కృషి చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు విద్య, రెవిన్యూ శాఖల అధికారులు కలిసికట్టుగాపని చేయాలన్నారు. రైతుల సంక్షేమానికి ఉద్దేశించిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తి చేసేందుకు తద్వారా రైతులందరికీ కామన్ రిజిస్ట్రేషన్ ఐడి ఇచ్చేందుకు మండల వ్యవసాయ అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. అవసరమైతే ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల సహకారం తీసుకొని ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయాలన్నారు. గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో నిర్దేశించిన 39 పారామీటర్స్‌లో మెరుగు పడాలంటే మండల స్థాయిలోని ఆయా శాఖల అధికారులందరూ సమన్వ యంతో పనిచేయాలన్నారు. ప్రతిబుధవారం మండల స్థాయిలో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించుకుని దేశంలోనే ఆదర్శవంతమైన బ్లాక్‌గాగట్టు మండలానికి పేరొచ్చేలా సంబంధిత అధికారులు అందరూ నిబద్ధతతో కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలోతాను ఇదివరకు పనిచేసిన జనగామ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని, జోగులాంబ గద్వాల జిల్లా కూడా మంచి స్థానంలో ఉండేలా పనిచేయాలని ఆదేశించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిపరచాలంటే ప్రతి ఒక్క అధికారి చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. విధుల్లో నిరక్ష్యం వహించే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్, హాజరైన అధికారులు

లో వోల్టేజ్ కరెంటు కష్టాలు ఉండవు : మంత్రి

మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

మాగనూర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ఆరుగాలం కష్టపడి శ్రమించే రైతన్నలకు ఇకనుండి లో వోల్టేజ్ కరెంట్ కష్టాలు ఉండవని రాష్ట్ర క్రీడా, యువజన, పాడి పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్య శాఖమంత్రి వాకిటి శ్రీహరి భరోసా నిచ్చారు. శుక్రవారం మాగనూర్ మండలంలోని వడ్వాట్ గ్రామంలో నూతన 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణం కొరకురెండు కోట్లతొంబై లక్షలు మంజూరు అయ్యాయని సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరగాతిన పూర్తిచేసి రైతులకు పూర్తిస్థాయిలో కరెంట్ అందించే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వడ్వాట్ గ్రామ సర్పంచ్ రవీందర్, తహసిల్దార్ సురేష్ కుమార్, మాగనూర్ మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, శివరాం రెడ్డి, విద్యుత్ అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల షూటింగ్ బాల్‌కు మక్తల్ విద్యార్థిని ఎంపిక

మక్తల్ టౌన్, ఫిబ్రవరి27 ప్రభాతవార్త: యాదాద్రి భువనగిరి జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 16 వరకు యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారంలో జరిగిన 45వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల షూటింగ్ బాల్ పోటీలలో, తెలంగాణలోని 33 జిల్లాల బాలికల జట్లు పాల్గొనగా, నారాయణపేట జిల్లా, బాలికల జట్టు పాల్గొని, క్రీడల్లో ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో 5వ స్థానం, పొందుటకు మక్తల్ కేశవ్‌నగర్ పేద కుటుంబానికి కు చెందిన జి.చంద్రకళ గణేష్ ఏకైక కూతురు కె. దీక్ష మంచి ప్రతిభను కనపరిచినందుకు, ప్రశంసాపత్రం, మెడల్ పొందినందుకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలంమెడల్ సర్టిఫికెట్ అందజేసిశాలువాతో ఘనంగా సన్మానించి అభినందించినట్లు తల్లి పిఈటి జి. చంద్రకళ తెలిపారు. పిఈటి జి. చంద్రకళ జిల్లా జట్టు కోచ్‌గా తన విధిని సక్రమంగా నిర్వహించినందుకు చంద్రకళ కు కూడా ప్రశంసా పత్రం బి.గోపాలం అందజేసి అభినందించారు. కె.దీక్ష ప్రస్తుతము మక్తల్ కేరళఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. కె. దీక్ష రాష్ట్రస్థాయి క్రీడలలో ప్రశంసా పత్రము పొందినందుకు తల్లిదండ్రులు చంద్రకళ, గణేష్ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, బి.గోపాలంకు ధన్యవాదాలు తెలిపారు.

బొమ్మనపాడులో ఫైనాన్షియల్ లిటరసీ ప్రత్యేక శిబిరం

నారాయణపేట, ఫిబ్రవరి27 ప్రభాతవార్త: మండలంలోని బొమ్మనపాడు గ్రామంలో ఆర్‌బీఐ విడ్స్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో విలేజ్ లెవల్ ఫైనాన్షియల్ లిటరసీ స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఆర్థిక అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై వాటి ప్రయోజనాలపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు ఎవరితోనూ పంచుకోరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, కౌన్సిలర్లు అనసూయ, వెంకటేష్ గౌడ్‌లు పాల్గొని ప్రజలకు ఆర్థిక భద్రతపై సూచనలు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఆధునిక సౌకర్యాలతో సాయిధ కన్వెన్షన్ హాల్

మొదటి పేజీ తరువాయి భాగం..

జోగుళాంబ గద్వాల్ జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు పూల మొక్క అందజేసి అతిథిని ఆహ్వానించారు. తదుపరి 10వ బెటాలియన్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అదనపు డీజీపీ గారు ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన సాయిధ కన్వెన్షన్ హాల్‌ను ఘనంగా ప్రారంభించారు. అనంతరం సాయుధ చైతన్య స్కూల్‌లో వేదికపై కొత్తగా నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టును కూడా ప్రారంభించారు. తరువాత బెటాలియన్ పరిధిలో త్వరలో నిర్మించబోయే 30 షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ నిర్వహించారు. స్కూల్ ఆవరణలో అదనపు డీజీపీ, జిల్లా ఎస్పీమొక్కలు నాటారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బందితో సమావేశమై, సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబ సభ్యుల సౌకర్యాలు , బెటాలియన్ సమగ్ర అభివృద్ధికి ఈ సదుపాయాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఇన్‌చార్జ్ కమాండెంట్ ఎం. జయరాజుకి సూచించారు. సాయిధ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు డీజీపీతన ప్రసంగంలో జడ్చర్ల గొల్లపల్లి చెరువులో మృతదేహాలను వెలికితీసిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర స్థానిక మరియు మున్సిపల్ ఎన్నికలు, గోవా రాష్ట్రంలో జరిగిన పరేడ్, బీహార్ రాష్ట్రంలో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందిని ప్రశంసించారు. అలాగే 10వ బెటాలియన్‌లో ఉత్తమ ప్రతిభకనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్లు నరేందర్ రెడ్డి గారు మరియు పాణి గారికి ఉత్తమ సేవ పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, బెటాలియన్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలుసిబ్బందికి ఉత్తమ వాతావరణాన్ని కల్పించడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉత్తేజాన్ని అందిస్తాయని తెలిపారు. ఇలాంటి సదుపాయాలు పోలీసుసిబ్బంది పనితీరును మరింత మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ కమాండెంట్ ఎం. జయరాజు, అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఇటిక్యాల ఎస్సై రవి, బెటాలియన్ అధికారులు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నరసింహారాజు, ఆర్పి సింగ్, ధర్మారావు, రాజేశం, రాజు , సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న డిజిపి సంజయ్ కుమార్ జైన్

మాదకద్రవ్యాల నిషేధంపై కఠిన చర్యలు తీసుకోవాలి

◆ అదనపు కలెక్టర్ శ్రీను

నారాయణపేట, ఫిబ్రవరి27 ప్రభాతవార్త: నారాయణపేట జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో నిర్వహించిన యాంటీ నార్కోటిక్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నట్లు రుజువైతేచట్టపరమైన చర్యలతో పాటుప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. జూనియర్, డిగ్రీ, మెడికల్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

యాంటీ నార్కోటిక్ సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీను

పాఠశాల స్థాయినుంచే విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించాలని అన్నారు. గంజాయి సరఫరాపై పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖలుసమన్వయంతో పనిచేసిజిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని తెలిపారు.

కుమ్మెర ఘటన దోషులకు కఠినగా విధించాలి

అంబేద్కర్ చౌరస్తాలో రజక సంఘం నిరసన

ఉప్పునుంతల, ఫిబ్రవరి27 ప్రభాతవార్త: కుమ్మెర ఘటనకు కారకులైన వారిని కఠినంగా వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో రజక సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని న్యాయం కోసం నినాదాలు చేశారు. నిరసన సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుమ్మెర ఘటన సమాజాన్ని కలచివేసేలా ఉందని, బాధితులకు న్యాయం జరగాలంటే దోషులపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై కఠినచర్యలుతీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించడంతో పాటు, న్యాయ పరమైన సహాయం అందించాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం రజకసంఘ నాయకులు తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి

తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ బాల్ రాంనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో కుమ్మెర ఘటనకు సంబంధించి దోషులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయంఅందేలా చర్యలుతీసుకోవాలని కోరారు. అలాగే ఘటనపై నిస్పక్షపాత విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ విద్య

◆ మండల విద్యాధికారి మురళికృష్ణ

◆ ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : మండలంలోని అల్లిపూర్ గ్రామ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు దేశభక్తి ,జానపద, సినీ గీతాలకు నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మురళికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ విద్య అందుతుందని ,ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ఆయన కోరారు. ప్రైవేటు పాఠశాలలు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని, నాణ్యమైన

వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్యాలు

విద్య ఒక్క ప్రభుత్వ పాఠశాలలోనే అందుతుందని ఆయన తెలిపారు. వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్యాలు చాలా చక్కగా చేశారని, పాటల కనుగుణంగా అభినయం చాలా చక్కగా చేశారని ఆయన తెలిపారు. అల్లిపూర్ పాఠశాలలో ప్రతి ఏటా పాఠశాల వార్షికోత్సవం నిర్వహించడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న మాజీ ఎంపీటీసీఫారుక్‌తో పాటు ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నషి మున్నిషా పర్వీన్ ను గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శారద లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ నిరంజన్ ,గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు

భూత్పూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం గూడులేని అర్హులైన నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) ఆయన సతీమణి కవితామధుసూధన్‌రెడ్డి దంపతులు భూత్పూర్ మండలంలోని పలు గ్రామాలలో వేర్వేరుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ మండలంలోని హస్సాపూర్ ,కప్పెటలో అబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించగా, ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవితామధుసూధన్‌రెడ్డి భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. శుక్రవారం భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామానికి చెందిన చాకలి చంద్రమ్మ, చాకలి రాములమ్మల ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన

పోతులమడుగులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

అన్నాసాగర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవితా మధుసూధన్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులకు కొత్తదుస్తులు బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవితా మధుసూధన్‌రెడ్డి అన్నాసాగర్ గ్రామానికి అనిత యాదయ్య ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి వారికి నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోతులమడుగు కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్, గ్రామ సర్పంచి ఆనంద్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచి కోట్ల కిష్టయ్య తదితరులు పాల్గొనగా, అన్నాసాగర్ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుక రవాణా

మొదటి పేజీ తరువాయి భాగం..

తమ స్వలాభం కోసం మలికిమియన్పల్లి పిల్లి వాగు నుండి అనుమతులు ఇవ్వడం ప్రారంభించారు. ఒక్కో ట్రాక్టర్ కు రెండు ట్రిప్పుల పేరుతో అనుమతులు తీసుకొని సాయంత్రం వరకు వందల ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు. అనుమతులు మంజూరు చేసిన రెవెన్యూ అధికారు లకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారు ముడుపులు అందజేస్తున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ముందు నుండి వెళుతున్న కూడా పోలీసు సిబ్బంది దానిపై దృష్టి సారించకపోవడంతో అక్రమ ఇసుక రవాణాదారులు ఆడింది ఆటపాడింది పాటగా సాగుతోంది అన్నారు. పిల్లి వాగు వెంబడి ఉన్న పలువురు రైతులు తమ భూములు కోతకు గురైన విషయం స్థానిక తహసిల్దార్ తో పాటు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేసిన కూడా పట్టించుకోవడంలేదని తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు విజిలెన్స్ సిబ్బంది శ్రద్ధ వహించి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని ప్రభుత్వం గుర్తించిన కమాలుద్దీన్ పూర్ ఇసుక క్వారీ నుండి ఇందిరమ్మ ఇండ్లతో పాటు ప్రభుత్వ పనులకు ఇసుకను తరలించాలని కోరుతున్నారు.

మార్చి 3న హోలీ పండుగ

నారాయణపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: నారాయణపేటలో హోలీ పండుగను మార్చి 3న జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పీ) పేట విభాగం ప్రకటించింది. ముందురోజు రాత్రి సంప్రదాయబద్ధంగా కామ దహనం నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, అధ్యక్షుడు మురళి భట్టడ్ తెలిపారు. మార్చి 3న మధ్యాహ్నం వరకు హోలీ వేడుకలను పూర్తి చేసుకోవాలని నగర కార్యదర్శి ప్రవీణ్ కడదాస్ సూచించారు. వేడుకల సందర్భంగా ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతియుతంగా, సామరస్యంతో నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు. అదే రోజు మధ్యాహ్నం 3.20 గంటల నుంచి సాయంత్రం 6.47 గంటల వరకు గ్రహణం ఉండనున్నందున గర్భిణీలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భక్తులు, ప్రజలు ప్రభుత్వ సూచనలు, వైద్యుల సలహాలు అనుసరించి పండుగను ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు.

జాతీయ సైన్స్ దినోత్సవానికి విద్యాశాఖ ఏర్పాట్లు

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

ఉప్పునుంతల ,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో పలు విజ్ఞాన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల ద్వారా వివిధ విజ్ఞాన పోస్టర్ల ప్రదర్శన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. అలాగే సమీపంలోని శాస్త్రవేత్తలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అనుసరణీయ సైన్స్ అంశాలపై ప్రయోగాలు చేయించడం, సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన, క్లాస్/చాప్టర్ వారీగా సైన్స్ సామాగ్రి వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. ఒకే తరగతికి ఒక అంశం కేటాయించి విద్యార్థులు సృజనాత్మకంగా మోడళ్లను తయారు చేయాలని సూచించారు. పాఠశాల స్థాయిలో సైన్స్ పుస్తకాల ప్రదర్శన, పోస్టర్ సైన్స్ అంశాల ప్రదర్శనతో పాటు తొలిదశ శాస్త్రవేత్త సామర్థ్యాలను వెలికితీయాలని విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. విజ్ఞాన మేళా నిర్వహించి విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులను, సమాజంలోని ప్రముఖులను విజ్ఞాన మేళాలో పాల్గొనేటట్లు ఆహ్వానించి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్న చింతకుంట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణ ఓబుల్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని పల్లమర్రి గ్రామానికి చెందిన రాఘవేంద్ర, ఎర్రగుల్ల శ్రీనివాస్ రెడ్డి ఇరువురు కలిసి 18వ తేదీ నాడు టీఎస్ 06 ఎఫ్ ఎల్ 4551 బైకుపై దేవరకద్రకు వెళ్లి తమ పనులు ముగించుకొని తిరిగి పల్లమరి గ్రామానికి వస్తుండగా శ్రీనివాస్ రెడ్డి అతివేగంగా బైక్ ను నడపడంతో లాల్ కోట గ్రామ బస్టాండులో గల స్పీడ్ బ్రేక్ వద్ద ప్రమాదవశాత్తు బైకుపై వెనక కూర్చున్న రాఘవేందర్ (35) క్రింద పడటంతో తలకు వెనుక భాగంలో బలమైన రక్త గాయం కావడంతో వెంటనే దేవరకద్రలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేసి ఇంటికి తీసుకెళ్లారు. అదేరోజు రాత్రి 9 గంటల ప్రాంతంలో రాఘవేంద్రకు ఆయాసం ఎక్కువ కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స నిర్వహించగా మెరుగైన వైద్యం కోసం వైద్యుల సలహా మేరకు 19 తేదీ నాడు హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. శుక్రవారం మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఒక కుమారుడు సంతానం కలదు.

అమ్మపల్లి గ్రామ అభివృద్ధికి సహకరించండి

మాగనూర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: అమ్మపల్లి గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులు శుక్రవారం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. వడ్వాట్ గ్రామ సబ్ స్టేషన్ భూమి పూజకు విచ్చేసిన మంత్రికి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని, బస్సు సౌకర్యంతో పాటు అంగన్‌వాడి భవనం మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులుకృష్ణ, వెంకటేష్, పరశురాం, ఆది, నరేష్, ర మేష్, తమన్న, బలగారి శీను, బాలకృష్ణ, రవి, పోగుల శివప్ప ఉన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరకాస్తుల ఆహ్వానం

గద్వాల ఫిబ్రవరి27, ప్రభాతవార్త: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్, హనుమకొండ, క్రీడా పాఠశాలల్లో 4 వ తరగతి లో ప్రవేశాల కోసం జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడల అధికారి ఎం కృష్ణయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతిలో ప్రవేశాలకు పోటీలునిర్వహించి విద్యార్థులని ఎంపిక చేస్తారన్నారు. ప్రతి క్రీడా పాఠశాలల్లో 20 చొప్పున బాలురు, బాలికలకు సీట్లు ఉంటాయన్నారు. ఎంపికైన విద్యార్థులు నాలుగవ తరగతి నుంచి ఇంటర్ వరకు ఎలాంటి ఖర్చు లేకుండా చదువుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 28 నుంచి మార్చి 4వ తేదీలోగా వెబ్సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు 1.9.2017 నుంచి 31.8.2018 మధ్య జన్మించి ఉండాలని అన్నారు.

కమిషన్ నివేదిక.. ఉపాధ్యాయుల ప్రతిష్టకు భంగం

నారాయణపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ముఖ్యమంత్రికి సమర్పించిన నివేదికలో కమిషన్ పరి

రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా జె.ఎల్.బి హరిప్రియ

బాధ్యతలు స్వీకరిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: రెవెన్యూ అదనపు కలెక్టర్ గా జె.ఎల్.బిహరిప్రియ జిల్లా కలెక్టర్‌కార్యాలయంలో శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్‌ను కలిసి అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

పదో తరగతి హాస్టల్ విద్యార్థులకు శిక్షణ

వసతి గృహ విద్యార్థుల ట్రైనింగ్ కార్యక్రమానికి హాజరైన సంక్షేమ హాస్టల్ వార్డెన్లు

చిన్నంబావి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త: జిల్లాలోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష మెలకు వలపైన ఎస్సీ,ఎస్టీ,బీసీ ప్రభుత్వ వసతి గృహాలలో చదువు తున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరిగింది. పదవ తరగతి పరీక్షలు రాసే సంక్షేమ హాస్టల్ విద్యార్థులందరు ఉపాధ్యాయులు చెప్పే అన్ని విషయాలు ఆకలింపు చేసు కుని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి వార్షిక పరీక్షలలో నూటికి నూరు శాతం మంచి ర్యాంకు తో విజయం సాధించి అధికారులకు,మన జిల్లాకు మంచి పేరు తేవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి రాంజీరావు, సహాయ ఎస్సీ అభివృద్ధి అధికారిని శ్వేత,కొప్పునూర్ వసతి గృహ సంక్షేమ అధికారి రవీందర్‌రెడ్డి ఆకాంక్షించారు. చదుకుంటేనే మన భవిష్యత్తులో అన్నిరంగాలలో బాగుపడ తామని సూచించారు. మొదట జిల్లా జాయింట్ కలెక్టర్ యాదయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్య క్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మూడు డిపార్టుమెంట్ వసతి గృహ సంక్షేమ అధికా రులు, విద్యార్థులు,వర్కర్స్ ,ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి రాంజీరావు, సహా య అభివృద్ధి అధికారిని శ్వేత,కొప్పునూర్ ఎస్సీ వసతి గృహ సంక్షేమ అధికారి రవీందర్‌రెడ్డి,జిల్లా బీసీసంక్షేమ అధికారి ఎండీ ముజాహిద్‌ఖాన్, ఎస్సీ వసతి గృహ సంక్షేమ అధికారులు సత్యనారాయణ యాదవ్,లక్ష్మి నారాయణ, కిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొజెక్టర్‌తో బోధనాభ్యసన

చిన్నంబావి, ఫిబ్రవరి27 ప్రభాతవార్త: మండల పరిధిలోని కొప్పునూరు గ్రామ పాఠశాలలో ప్రొజెక్టర్ సహాయంతో విద్యార్థులకు విద్యను బోధించడం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బిచ్చన్న ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అనుకలి శివరాముడు, ఉపాధ్యాయులు మధు,మాట్లాడుతూ డిజిటల్ విధానంలో బోధన వల్ల విద్యార్థులలో ఆసక్తి, అవగాహన, అభ్యాస నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. పాఠశాలలో ఇటువంటి డిజిటల్ కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య, అంగన్‌వాడీ కార్యకర్త ఖాజాబాను, శ్రీని వాసులు,నాని,తల్లిదండ్రులు కత్తి జానీ,తగరం రాజేశ్వరి, టిడిపి మండల అధ్యక్షుడు హస్నొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పరిశీలన

కల్వర్టును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత నర్సింహులు

జడ్చర్ల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: గత కొన్ని సంవత్సరాలుగా భారీ వర్షాల కారణంగా కాలనీలో రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేప థ్యంలో జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతి నగర్ కాలనీ పేస్ 2 నారాయణపేట వెంచర్ కాలనీవాసులు కల్వర్టు సమస్యను శాసనసభ్యులు జనం పల్లి అనిరుదరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత నర్సింహులు కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ త్వరలోనే కల్వర్టు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డికి కోనేటి పుష్పలత నర్సింలుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు కాంగ్రెస్‌నాయకులు బొక్క రఘు, శ్రీను,రఘు,కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు వాసు, దేవ్,సుధాకర్,రామకృష్ణ, మహేష్, ఆంజనేయులు, మధు, రాఘవచారి, సత్యం,మూడవత్ రమేష్,కేశవులు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

తమిళనాడుకు పియు జట్టు

అభినందించిన వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నిర్వహించే సౌత్‌జోన్ ఆల్ ఇండియా ఇంటర్ యూని వర్సిటీ టోర్నమెంట్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ చెస్ మెన్ టీం బయలుదేరింది. తమిళనాడులోని తిరుచిరాపల్లిలోని భారతీ దాసన్ యూనివర్సిటీలో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో పాల మూరు యూనివర్సిటీ క్రీడాకారులు పాల్గొననున్నారు. మార్చి 2 నుంచి ఆరవ తేదీ వరకు పోటీలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకా రులను పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ॥ జిఎం శ్రీనివాస్ అభి నందించి క్రీడా దుస్తులను అందజేశారు. అలాగే క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తూ విజయలను అందుకోవాలని సూచించారు. అలాగే యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొ॥ పూస రమేష్ బాబు మాట్లాడుతూ క్రీడాకారులు నిత్యం ప్రాక్టీస్ చేసి ఆదర్శమైన క్రీడాకారులనుఎంచుకొని వారిమార్గంలో నడిచి కష్టపడి విజయా లను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా.వై. శ్రీనివాసులు,చెస్ కోచ్ ఆనంద్ బాబు, డా. బి.సురేష్ చెస్ ట్రైనర్ తో పాటు ఎంపికైన క్రీడాకారులు కార్తిక్, జితేందర్, ప్రవీణ్, నవీన్, శివరాజ్, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో.. అరాచకం!

- చెట్లను తొలగించి ఏడు రోజులైనా స్పందన కరువు
- అటవీ శాఖ అధికారుల నిరక్ష్యం
- పట్టించుకోని రెవెన్యూ శాఖ
- జీనుగురాల పల్లె ప్రకృతి వనంలో చెట్లు తొలగించడంపై పిసిసిఎఫ్‌కు మాజీ సర్పంచ్, గ్రామస్తుల ఫిర్యాదు

జీనుగురాల పల్లె ప్రకృతి వనంలో తొలగించిన చెట్లు



దేవరకద్ర, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : పల్లె ప్రకృతి వనంలో రేపుగా పెరిగిన మొక్కలను తొలగించి అభివృద్ధి మాటన అరాచకం చేస్తున్న అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోఎ స్తున్నారు. దేవరకద్ర నియోజకవర్గం జీనుగురాల గ్రామపంచాయతీలోని పల్లె ప్రకృతి వనంలో గత వారం కిందట సుమారు 200 చెట్లను తొల గించడం పై అధికారులు పట్టించుకోవడంలేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటు రెవె న్యూ అధికారులతో పాటు అటు ఫారెస్ట్ అధికా రులు సైతం పంచనామా పేరుతో అలసత్వం వహిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పల్లె ప్రకృతి వనంలో చెట్ల తొలగింపునకు సంబం ధించి వారం గడుస్తున్న అధికారిక సమాచారం వెల్లడించలేదు. అక్కసుతోనే అభివృద్ధి పేరుతో పచ్చని చెట్లనుతొలగించడం ఎంతవరకు సమం జసం అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలోని చెట్లను తొలగిం చడం జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీసింది. గత శనివారం ఉదయం పల్లె ప్రకృతి వనంలోని సుమారు 200 చెట్ల వరకు జెసిబి సాయంత్రం తొలగించడంతో గ్రామస్తులు ఫోటోలు వీడి యోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అంతేకాకుండా ఇటీవల అంగన్‌వాడీ భవనానికి సంబంధించి ఇప్పటికే పల్లె ప్రకృతి వనంలో సుమారు 50 మొక్కలను తొలగించడం జరి గింది. చిన్నపిల్లలకు ఇబ్బందులు కలగకూడదు అనే ఉద్దేశంతో అక్కడ భవన నిర్మాణం చేపట్టిన ఎలాంటి వాగ్వాదం, చర్చలు జరగలేదు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు: ప్రస్తుతం గోదాం నిర్మాణం పేరుతో అభివృద్ధి అంటూ ఏపుగా పెరిగిన వృక్షాలను తొలగించడం ఎంతవరకు సమంజసం అని గ్రామస్తులతో పాటు మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి సైతం సోషల్ మీడియా వేదికగా నిలదీశారు. దీంతో పాటు మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వే టివ్ ఆఫ్ ఫారెస్ట్‌కు ఫిర్యాదు చేశారు. గత ప్రభు త్వం చేపట్టిన ఆనవాళ్లు లేకుండా చేయాలనే దురుద్దేశంతో అక్కసుతో చెట్లను తొలగించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ సర్పంచ్ నాగమ్మ మొదట ఎండిన చెట్లను తొలగించామని చెప్పి, కేవలం 15 చెట్లను మాత్రమే తొలగించామని రెండుసార్లు రెండు విధాలు గా మరోసారి మీడి యాకు తెలి పారు. అసలేం జరిగింది ఎన్ని చెట్లను తొల గించారు అనేది అధికారులే తేల్చా ల్సి ఉంది.

కేటీఆర్ స్పందించడంతో..

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జీనుగురాల ఘటనపై స్పందించారు. ట్విట్టర్ ఎక్స్ ఖాతా వేదికగా చినుగురాళ్ల ఘటనపై స్పందిస్తూనే హైదరాబాద్లో మీడియాతో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. గత ప్రభుత్వం పల్లెల్లో పచ్చదనం పెంచాలని, ప్రకృతిని ప్రజలకు మరింత దగ్గర చేయాలనే సదుద్దేశంతో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అక్కస్సుతో కావాలనే చెట్లను కూడా వదలడం లేదని ఘాటుగా స్పందించారు. కేటీఆర్ స్పందించడంతో రాష్ట్ర వ్యాప్తంగా జీనుగురాల గ్రామపంచాయతీ పేరు అందరి నోళ్ళలో నానినట్లు అయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పంచనామా నిర్వహించి నివేదికను ఉన్నతాధి కారులకు అందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.

KTR @KTRBRS

కాంగ్రెస్ కబంద హస్తాల్లో చిక్కుకుని రెండేళ్లుగా విలవిలలాడుతున్న తెలంగాణలో మనషులనే కాదు.. చివరికి పచ్చని చెట్లను కూడా బతకనివ్వడం లేదు.

ప్రతి పల్లెలో పచ్చదనం ఉండాలనే మహోన్నత లక్ష్యంతో కేసీఆర్ గారు నిర్మించిన పల్లె ప్రకృతి వనాలపై కూడా పగబట్టడం దుర్మార్గమైన చర్య.

మహబూబ్ నగర్ లోని దేవరకద్ర మండలం జీనుగురాలలో పల్లె ప్రకృతి వనంలోని 200 చెట్లను కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే నిర్దాక్షిణ్యంగా నరికివేయడం దారుణం.

పదేళ్లపాటు ఆహ్లాద వాతావరణంలో కళకళలాడిన పల్లెలను అన్నిరకాలుగా ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ నిజస్వరూపం రోజుకో రూపంలో బయటపడుతోంది.

ఇప్పటికే చెక్ డ్యామ్ లను పేల్చివేస్తున్నారు. చెరువులను చెరబట్టారు. వ్యవసాయాన్ని కుప్పకూల్చారు. కులవృత్తులను కాలరాశారు. ఇప్పుడు నీడనిచ్చే చెట్లను కూడా అడ్డంగా నరికేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఈ దుశ్చర్యకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలి.

యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలి

పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ రమేష్ బాబు

100 రోజుల యాక్షన్ ప్లాన్ ఫర్ స్కిల్ డెవలప్మెంట్, ఎంప్లాయబులిటీ ప్రోగ్రాం గురించి చర్చిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : పరిశ్రమలకు అవసరమగు నైపుణ్యాల పెంపుదల కోసం 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో అకాడమిక్ ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఫర్‌స్కిల్ డెవలప్మెంట్, ఎంప్లాయబులిటీ ప్రోగ్రాంకిముఖ్య అతిథిగా పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ॥ పి రమేష్ బాబు హాజరై ప్రసంగించారు. రిజిస్ట్రార్‌ఆచార్య పి.రమేష్‌బాబు మాట్లాడుతూ పరిశ్ర మలకు అనుగుణమైన నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దడం కాలా నుగుణ అవసరమని, ఈదిశగా రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను యూనివర్సిటీ పీజీ కాలేజ్ తో పాటు పీజీ సెంటర్ కొల్లా పూర్, పీజీ సెంటర్ గద్వాల్, పీజీ సెంటర్ వనపర్తి స్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని పి. రమేష్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుత గ్లోబల్ పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం సిద్ధాంతపరమైన జ్ఞానంతో మాత్రమే కాకుండా, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక, ప్రవర్తనా, డిజిటల్‌నాయకత్వ నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. విద్యార్థుల ఉపాధి అవకాశాల విస్తరణే విశ్వవిద్యాలయ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యార్థులనైపుణ్యాల అంచనా (స్కిల్ మ్యాపింగ్) నిర్వహించడం అనుభ వాత్మక విద్య (ఎక్స్‌పీరియన్షియల్ లర్నింగ్) పద్ధతులను అమలు చేయ డం ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు తప్పనిసరి చేయడం స్వల్పకాలిక ఉపాధి ప్రధాన సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశపెట్టడం కమ్యూనికేషన్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఇంగ్లీష్‌సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించ డంవంటి అంశాలను అమలు చేయాలని, అదే విధంగా విద్యార్థులను ఎంఎస్ఎంఈలు,స్టార్టప్‌లు వివిధ ప్రభుత్వ ఉపాధి పథకాలతో అనుసం ధానం చేసి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలని తెలిపారు. అధ్యా పకుల నైపుణ్యాభివృద్ధి కోసం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు (ఎఫ్‌డిపిలు) నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యా రంగం, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు స్థానిక పరిశ్రమలు, ఆసుపత్రులు,ప్రయోగశాలలు మరియుఇతర సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డా. ఎన్. చంద్రకిరణ్, యూనివర్సిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ డా. డి.మధుసూదన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మన్నెమోని కృష్ణయ్య, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డా.సిహెచ్. రవికాంత్, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డా. ఏ.కరుణాకర్‌రెడ్డి, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డా. జె. మాలవి, ప్రిన్సిపల్ గద్వాల పిజి సెంటర్ సిహెచ్. వెంకటరెడ్డి, డా. రవి షరీన్, పిజీ సెంటర్ వనపర్తి డా. శివాదిత్య, ఫార్మసీ కాలేజ్ హెచ్‌ఓడి డా. వి. ప్రభాకర్ రెడ్డి, పొలిటికల్ సైన్స్ హెచ్‌ఓడి డా. నాగం కుమార్ స్వామి, ఎంబీఏ హెచ్‌ఓడి జావేద్ మహమ్మద్ ఖాన్, డా. కె.రాజ్ కుమార్, డా. బృందాదేవి, డా.వేణు డాక్టర్ ఆంజనేయులు, డా. అశోక్ కుమార్, డా. సంతోష్, అకాడమిక్ ఆడిట్ సెల్ సమన్వయకర్తలు డా. ఎస్.రవి కుమార్, డా. సిద్ద రామ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌ను నెంబర్ వన్ చేస్తాం..

- ఎమ్మెల్యే యెన్నం కు ప్రత్యేక కృతజ్ఞతలు
- ప్రమాణ స్వీకారోత్సవంలో మేయర్ గుమ్మాల మమత

మాట్లాడుతున్న మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: తనకు ఇంత పెద్ద గౌరవం ఇచ్చి మేయర్ స్థానంలో నిలబెట్టిన ప్రతి ఒక్కరి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, మహబూబ్నగర్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే అత్యున్నత స్థానం లో నిలిపేందుకు కృషి చేస్తామని మహబూబ్‌నగర్ నూతన కార్పొరేషన్ మేయర్ గుమ్మాల్ మమత అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో జరి గిన ప్రమాణ స్వీకారోత్సవంలో ఆమె ప్రసంగించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, 3వ డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్‌నగర్‌ను రాష్ట్రంలోనే అందమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాననిహామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్‌సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మహబూబ్‌నగర్ పట్టణాన్ని ఒకసుందర నగరంగంగాతీర్చి దిద్దేందుకు అందరి సహకా రంతోకృషిచేస్తామని తనను ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞ తలు తెలిపారు. చివరగా మంత్రి వాకిటి శ్రీహరి,ఎమ్మెల్యే యెన్నం శ్రీని వాస్‌రెడ్డి నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లను సన్మానించారు.

పిర్యాదుల నోడల్ ఆఫీసర్‌గా ఎస్.రవి కుమార్

రవికుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న ప్రొ॥ పి. రమేష్ బాబు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి27 ప్రభాతవార్త: పాలమూరు విశ్వవిద్యా లయంలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగ అధ్యాపకుని డా.ఎస్. రవికుమార్ ను ప్రజావాణి పిర్యాదుల నోడల్ ఆఫీసర్ గా నియమిస్తూ పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ॥ పి. రమేష్ బాబు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డా. ఎస్.రవికుమార్ ని పలువురు అభినందనలు తెలిపారు.

మంత్రి అజహరుద్దీన్‌ను కలిసిన ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త : దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) శుక్రవారంహైదరాబాద్‌లోని తెలంగాణ సెక్రటేరియట్ రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అజహరుద్దీన్‌ను స్వయంగా కలిసి దేవరకద్ర నియోజకవర్గంలోని మూడు మున్సి పాలిటీలు (భూత్పూర్, కొత్తకోట, దేవరకద్ర)లతో పాటు అడ్డాకుల, చిన్నచింతకుట, మూసాపేట మండల కేంద్రాలలో షాదీఖానాల నిర్మాణాల కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జీఎంఆర్ మంత్రి అజహరుద్దీన్ కోరగా,సానుకూలంగా స్పందించిన మంత్రి షాదీఖానాల నిర్మాణాలను నిధులు మంజూరు చేస్తామని హామి ఇచ్చినట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు.

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

ఉప్పునుంతల ,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో పలు విజ్ఞాన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్య క్రమాల్లో భాగంగా విద్యార్థుల ద్వారా వివిధ విజ్ఞాన పోస్టర్ల ప్రద ర్శన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. అలాగే సమీపంలోని శాస్త్రవేత్తలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులనుఆహ్వానించి అవగాహన కార్యక్రమాలు చేపట్టను న్నారు. అనుసరణీయ సైన్స్ అంశాలపై ప్రయోగాలు చేయించడం,సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన, క్లాస్/చాప్టర్ వారీగా సైన్స్ సామాగ్రి వినియోగంపై అవగాహన కల్పించ నున్నారు. ఒకే తరగతికి ఒక అంశం కేటాయించి విద్యార్థులు సృజ నాత్మకంగా మోడళ్లను తయారు చేయాలని సూచించారు. విజ్ఞాన మేళా నిర్వహించి విద్యా ర్థుల ప్రతిభను ప్రోత్సహించాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదం డ్రులను, సమాజంలోని ప్రముఖులను విజ్ఞాన మేళాలో పాల్గొనే టట్లు ఆహ్వానించి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

ప్రమాదకరపు మలుపు.. అదుపుతప్పితే యమలోకానికే!

- మూడేళ్లుగా ముందుకు సాగని బ్రిడ్జి నిర్మాణం!
- ఒకవైపు లోతైన గుంత..మరోవైపు చెరువు
- రోడ్డు భద్రత సూచిక బోర్డులు, కాపర్ డ్యాం ఏర్పాటు చేయని వైనం
- కళ్ళముందు ప్రమాదమని తెలిసిన పట్టించుకోని అధికారులు

మధ్యలో ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణం

ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉన్న ప్రాంతం

కొల్లాపూర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రంలో స్థానిక తాసిల్దార్,పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న టువంటి చెరువు అలుగుపై పెబ్బేరు కొల్లాపూర్ రహదారి పై బ్రిడ్జి నిర్మాణం రెండేళ్లయిన పూర్తి కావడం లేదు. కాంట్రాక్టర్ నిరక్ష్యమ్లో? లేక నిధులు లేకపోవడమో? కానీ నేటికి పనులు ఆలస్యం అవటం వలన ప్రమాద కరంగా మలుపు కలిగి ఉండటం ప్రయాణికులు టు వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ తదితర వాహనాల రాకపోకలకు ప్రమాదకరా ఇబ్బందులు కలిగి రోడ్డు మలుపు కావడంతో సమీపంలోనే పోలీస్ స్టేషన్ ఉండడంతో ప్రయా ణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బ్రిడ్జి నిర్మాణాని సూచిస్తూ.. సదరు కాంట్రాక్టర్ లేదా ఆర్ అండ్ బి అధికారులు బోర్డును కానీ,రేడియం స్టిక్కర్లు కానీ, కనీస రక్షణ గోడ లేదా పోలీసు బరికెడు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు నూతనంగా నిర్మించే బ్రిడ్జి గుంతలోకి వెళ్లి ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. సదరు కాంట్రాక్టర్ గాని స్థానికంగా ఉన్న పోలీసులు కానీ లేదా ఆర్ అండ్ బి అధికారులు కానీ కనీసం సిగ్నల్ లేదా రేడియం సిగ్నల్‌లను ఏర్పాటుచేసి ప్రమాదాలను వారించాల్సిన బాధ్యతలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బ్రిడ్జి నిర్మాణంతో పాటు చెరువు కట్ట పైన రోడ్డు విస్తరణ పనులు కూడా పెండింగ్లో ఉండడంతో పాటు గత రెండే ళ్లుగా పనులు కొనసాగుతున్నప్పటికీ అక్కడ నుంచి ప్రయాణించే ప్రయాణి కులు కానీ, ప్రజలు కానీ ఈ ప్రమాదకర మలుపు దగ్గరకి పోవడం ప్రమా దం చోటు చేసుకునే అవకాశం ఉంది. అధికారులు కనీస సిగ్నల్స్ పాటించకపోవడం, రోడ్డు భద్రత నియమా నిబంధనలు ఏర్పాటు చేయకపోవడం వలన ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. కావున ఇట్టి విషయంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డు ప్రయాణాల ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత తీసుకొని ప్రయాణికులకు సహకరించగలరని ప్రయాణికులు కోరుతున్నారు. ఏది ఏమైనా పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఉన్న చెరువు కట్ట పై ప్రధాన రహదారి నిర్మాణంలో ఉన్న డబల్ రోడ్డు నిర్మాణం, అలుగుపై బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తిచేసి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన ఆవశ్యకత ఉంది. స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలని ప్రజలు వాపోతున్నారు.

చెరువుకట్టపై మధ్యలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు

రోడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

రెండేళ్లుగా చెరువు కట్టపై రోడ్డు విస్తరణ, మూలమలుపుపై చెరువు అలుగు మీద బ్రిడ్జి నిర్మాణం మధ్యలో ఆగిపోవడంతో పలు ప్రమా దాలు చోటు చేసు కుంటున్నాయి. ఇటీవల అదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండ లం షాంపూర్ సమీపంలో వంతెన వద్ద ప్రమాదా నికి గురైన ఆర్టీసీ బస్సులో 12 మందికి తీవ్ర గాయాలు కావడం గమనించదగ్గ విషయం.. ఇక్కడ సైతం అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలనీ లేనిచో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం నెలకొంటుంది.

— కొల్లి